# పొగబెట్టి చంపుతూంది నెల్లూరు మునిసిపాలిటి!

టౌన్‌లోని పోస్టల్‌కాలని, జిల్లా పరిషత్, స్టేట్ బ్యాంక్ కాలనీల్లో ఊడ్చిన చెత్తను, శానిటరీ సిబ్బంది అదే వీధుల్లో గుట్టగా పోసి తగుల బెడు తున్నారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ మంటలను చూస్తే, లంకాదహనం వలె కనిపిస్తుంది. ఈ చెత్త మంటల్లోంచి వెలువడే దట్టమైన పొగ ఇళ్లల్లోకి జొరబడి ప్రజలకు ఊపిరాడ నివ్వడం లేదు. కళ్లు మంటలతో పొంగి పోతున్నాయి. పిల్లలు పొగపీల్చి దగ్గలేక చస్తున్నారు. మునిసిపాలిటికలుషిత వాతావరణాన్ని నివారించాల్సిందిపోయి, ఈ పొగ పొట్టె విధానం ఏమిటో అర్థం కావడం

**నెల్లూరుసంగతులు**

లేదు. చెత్తను ఎక్కడికక్కడే తగులబెట్టమని సలహా ఇచ్చిన అధికారి ఎవరో తెలుసుకొని అతడ్ని సత్కరిస్తే బాగుంటుంది.

### బాలాజీ లాకర్స్ స్కూల్ వార్షికోత్సవం

నెల్లూరు రోహిణి నగర్‌లోని బాలాజీ లాకర్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ వార్షికోత్సవం 7తేది వైభవంగా జరిగింది. చూడ చక్కని వేదిక, ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలంకరణల మధ్య జరిగిన ఈ

తొరవ ఆఖరి పేజీలో



నెల్లూరు జేసీస్ మహిళా విభాగం తరపున రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేస్తున్న మహిళలు

# తెలుగుగంగ పూర్తయితే జిల్లా సస్యశ్యామలం!

జిల్లాలో తెలుగు గంగ బ్రాంచి కాలువలు పూర్తయితే 2 లక్షల 54వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంత్రి డాక్టర్ పరసారత్నం చెప్పారు. 5తేది జిల్లా పరిషత్ అతిథి గృహంలో మంత్రి తెలుగుగంగ అధికారులతో సమావేశమై పనుల ప్రగతిని సమీక్షించారు. ఏడవ బ్రాంచి కాలువ పనులలో, ఐదవ కిలోమీటరు వరకు కాలువల త్రవ్వకం పనులు జరుగు తున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఐదవ కిలోమీటరు నుండి 28 కిలోమీటరు వరకు సర్వేపనులు, భూసేకరణ పనులు, ఎస్టిమేట్లను యుద్ధప్రాతిపదికన చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తెలుగు గంగ 1 నుండి 7వ బ్రాంచి కాలువల పనులు పూర్తయితే సైదాపురం, రాపూరు, మనుబోలు, గూడూరు, పొదలకూరు, డక్కిలి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, బాలాయపల్లి మండలాల్లో 2 లక్షల 54వేల ఎకరాల భూమి సస్యశామలం అవుతాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు తెలుగుగంగ పనుల కోసం 8 కోట్ల రూపాయలు. ఖర్చు చేసి ఉన్నందున, అధికారులు మిగతా పనులు పూర్తి చేయడానికి ఉత్సాహం చూపాలన్నారు. జడ్పీఇన్‌ఛార్జి ఛైర్మన్ మల్లెమాల రాఘవరెడ్డి, తెలుగు గంగ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సి. సింహాచలం, బి. లీలాప్రసాదరావు, జివి. రామకృష్ణశాస్త్రి సమావేశంలో పాల్గొన్నారు.

### పూర్వ ద్విగుణిత అష్టావధానం

శ్రీ రామనవమి, షిర్డి సాయిబాబా

> **ఇంకెంత కాలిరి చూపిస్తారో ఈ అరచేతి స్వర్గం?**

జన్మదినోత్సవాలను పురస్కరించుకొని గాంధీనగర్‌లోని సాయిబాబా మందిరంలో పూర్వ దిగుణిత అష్టావధానాన్ని ఏర్పాటు చేశారు. అవధాని, కాకినాడ చైతన్య భారతి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గరికపాటి నరసింహారావును, పృచ్ఛకులు ఏ దశలోనూ ఇబ్బంది పెట్టలేక పోయారు. నిషిద్ధాక్షరి ప్రాశ్నికులు కెఎన్. రామానుజాచార్యులు, దుగ్గొట్టి రమణయ్య శ్రీరామ - సాయిబాబా ఏకత్వం మండోదరిని చూచి సీతయని భ్రాంతి పడిన ఆంజనేయ వర్ణనలు కందంలో సాగాలని కోరగా, ఏకాక్షర నిఘంటు సహాయం లేకుండా అన్వయక్లేశం లేని చక్కని ధారాశుద్ధిగల పద్యాలను అవధాని హేలగా చెప్పారు. ఉబ్బసం - క్షయ - మశూచి - కలరా వ్యాధులు గల నవయువతి సౌందర్య వర్ణన చేయమని కెవి. రమణయ్య కోరగా, "మేనిలోన తానుబ్బ సముద్రమయ్యే, అక్షయంబుగ అంట్లూ-క్షయవ్యాధిని; ఉండగలరా, ప్రేమసూచియై అంటూ మశూచి, కలరా వ్యాధులను పేర్కొంటూనే నవవధూ మణి వర్ణన రమ్యంగా చేశారు. స్వయంపాకుల శ్రీనివాసులు, గోసుకొండ వెంకట సుబ్బయ్య, పి. నాగరాజు, గుడి నారాయణ బాబు, కె. రమణయ్య, బివి. నరసింహం చక్కని ప్రశ్నలను అవధానిపై గుప్పించారు. దేవాలయ పాలకవర్గం అధ్యక్షులు మన్నెం అమరనాథరెడ్డి, అవధానిని - ప్రాశ్నికులను ఘనంగా సత్కరించారు. *

# జగ్జీవన్‌రాం సభలో మంత్రి రత్నం స్వంత డబ్బా మోత మార్మోగిపోయింది!

రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖా మంత్రి పరసా రత్నం ప్రజలకు అందుబాటులో వుండడం లేదని ఏ మహానుభావు డన్నాడోగాని, ఈ విషయమై 5తేది జరిగిన జగజ్జీవన్ రామ్ జయంతుత్సవ సభలో పెద్ద వివరణే ఇచ్చారాయన. సభలో ఎన్టీఆర్ ఫక్కీలో మాట్లాడను మొదలెట్టిన మంత్రి "పదవి నాకు ముఖ్యం కాదు. ప్రజలు ముఖ్యం; మీరు ఎప్పుడు మాట్లాడాలను కొంటే అప్పుడు ఫోన్ చేయండి. రెడీగా వుంటాను. వ్యక్తిగతంగా ఎక్కడకొచ్చి కలిసినా మాట్లాడుతాను. పెద్ద పదవిచ్చినా రత్నం మీ మనిషే"నని సొత్కర్ష చెప్పుకున్నారు. జగజ్జీవన్‌రామ్ గూర్చి చాలా తక్కువగా మాట్లాడిన మంత్రి తెలుగుదేశం పాలనలో విద్యా వ్యాప్తికి తీసుకొంటున్న నిర్ణయాల గూర్చి సుత్తికొట్టి ప్రజల సహనాన్ని పరీక్షించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ గతంలోకన్నా ఎస్సి, ఎస్టి, బిసి వర్గాల వారు అభివృద్ధి చెందేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన జీవితానికి ఒక ఉన్నతాశయాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. ఎస్పీ ఈశ్వరరెడ్డి, సాంఘిక సంక్షేమ అధికారి జివి. రఘురామ్, మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డి, జడ్పీఇన్‌ఛార్జ్ ఛైర్మన్ ఎం. రాఘవరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే విజయరామిరెడ్డి, అరుంధతీయ సంఘ నాయకులు జయదేవదానం, సుబ్బారావు, జివి. కృష్ణయ్య,జయరాం తదితరులు సభలో మాట్లాడారు. *

WORLD CLASS QUALITY FROM A WORLD CLASS COMPANY
KING AMONG CEMENTS
ISO 9002
COMPANY
Priya
53 GOLD
MEGA CEMENT
A Quality Product of PRIYADARSHINI CEMENT LIMITED

